ముగిసిన నాటకోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 6: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న భద్రాచలం కళాభారతి నాటకోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చిన్నారుల నృత్యాలు అలరించాయి.

కర్ణాటకలో భద్రాద్రి రామయ్య కల్యాణోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 6: హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా వివిధ రాష్ట్రాల్లోని భక్తుల ఆహ్వానం మేరకు అక్కడ సీతారామ చంద్ర స్వామి కల్యాణోత్సవాలను భద్రాచలం దేవస్థానం నిర్వహిస్తున్నది. ప్రచార రథం ద్వారా అర్చకులు అక్కడకు వెళ్లి కల్యాణోత్సవాలు జరుపుతున్నారు. ఈ నెల 20న బెంగుళూరులోని వైట్ ఫీల్డ్ ఏరియా, 21–22 తేదీల్లో కోలార్ జిల్లాలోని బెట్ట హోస పూరలో కల్యాణోత్సవాలు ఉంటాయి. దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 6 : కిరాణా షాపులో చోరీ జరిగిన ఘటన మండలంలోని పాండురంగాపురంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కృష్ణ పాండురంగాపురం ప్రధానవీధిలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా... షాపు షట్టరు పగులగొట్టి గల్లా పెట్టెలోని రూ. 60 వేలు, సామన్లు దొంగిలించినట్లు గుర్తించాడు. కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాబ్ అటెండర్ పోస్టుల్లో అవినీతిపై విచారణ జరపాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 : సింగరేణి మహిళా జూనియర్ కాలేజీలో ల్యాబ్ అటెండర్ పోస్టుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ డిమాండ్ చేశారు. వెంటనే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అటవీ సంపదపై అవగాహన

టేకులపల్లి, ఫిబ్రవరి 6: ప్రకృతి ప్రసాదించిన అటవీ సంపదపై, దానిని కాపాడుకోవాల్సిన అవసరంపై మండలంలోని కొప్పురాయి పంచాయతీ ఇప్పలచెలక గ్రామస్తులకు టేకులపల్లి ఫారెస్ట్ రేంజర్ ముక్తార్ హుస్సేన్ మంగళవారం అవగాహన కల్పించారు. అధికారులు కృష్ణ, శ్రీను, దేవ్‌సింగ్, పవన్‌కుమార్, హతీరాం, రాంమూర్తి, నగేష్, రాంసింగ్, గాంధీ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

టేకులపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని ప్రేగళ్లపాడు మాజీ సర్పంచ్ కణితి రమాదేవిని, వార్డు సభ్యులను బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని శ్యామ్‌బాబు మంగళవారం సన్మానించారు. ప్రేగళ్లపాడు రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సరోజిని, సీడీపీవో కెఎం.తార, ఉప సర్పంచ్ మాధవి, కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జెన్కో, ట్రాన్స్‌కో సీఎండీని కలిసిన నాయకులు

పాల్వంచ, ఫిబ్రవరి 6: హైదరాబాద్ విద్యుత్‌సౌధలో టీఎస్ జెన్కో, టీఎస్ ట్రాన్స్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K.
9160900024 / 9640400073.
NT-319433-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భరోసా కేంద్రం ప్రారంభం

భరోసా కేంద్రం వర్చువల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 6: మహిళలు, చిన్నారుల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భరోసా కేంద్రాన్ని డీజీపీ రవిగుప్తా మంగళవారం తన కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ లైంగికదాడి కేసులు, పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వారికి వైద్యుడు, సైకాలజిస్టు, న్యాయాధికారి, పోలీసులు న్యాయ సహాయం చేయడం, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలను అందించాలనే లక్ష్యంతోనే ఈ భరోసా కేంద్రం పని చేస్తుందన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎవరి పరిధిలో వారు పనిచేస్తూ సత్వర న్యాయానికి కృషిచేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ విజయ్ బాబు, కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై రమాదేవి, ఏహెచ్‌టీయూ ఎస్సై వాసికర్ల శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, రాజు వర్మ, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ టి. రమేశ్, ఎస్సైలు నరేశ్, రవి, పురుషోత్తం, జుబేదా, విజయ, విజయకుమారి, భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రత్యేకాధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : పల్లెల అభివృద్ధికి ప్రత్యేకాధికారులు కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారుల విధులపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం జిల్లాలోని 479 గ్రామపంచాయతీలకు 218 మంది ప్రత్యేకాధికారులను నియమించిందన్నారు. పంచాయతీలకు ఎన్నికలు జరిగే వరకు పరిపాలన విషయంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రత్యేకాధికారులు విధులు నిర్వర్తించాలన్నారు.

పంచాయతీ విధుల నిర్వహణపై అవగాహన కోసం ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, మొక్కల పెంపకం, ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ, డ్రై వేస్ట్ వ్యర్థాల నిర్వహణ, పన్నుల వసూళ్లు వంటి ఎంతో ప్రాధాన్యమైన విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వేసవి కాలం వస్తున్న దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సరఫరా తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడైనా పైపులైన్లు లీకేజీలు, మరమ్మతులున్నా తక్షణమే చేపట్టి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం గ్రామాల పరిశుభ్రతకు ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రతిష్ఠాత్మకంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టిందని, దీనిని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీపీవో రమాకాంత్, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

నేడు కారుణ్య నియామకపత్రాలు అందజేత

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 6 : సింగరేణిలో గత నాలుగునెలలుగా వేచిచూస్తున్న డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ అభ్యర్థులకు(బదిలీ వర్కర్లు) బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చేతుల మీదుగా కారుణ్య నియామకపత్రాలు అందజేయనున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్, ఆర్‌సీ) కే.బసవయ్య తెలిపారు. నియామకపత్రాలు అందుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఒక్కో వ్యక్తికి రూ.1600 సింగరేణి యాజమాన్యం చెల్లించనున్నది.

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

పినపాక : తనిఖీలు చేస్తున్న ఎస్సై వెంకటప్పయ్య

అశ్వారావుపేట, ఫిబ్రవరి 6: పట్టణంలోని పలు దుకాణాలను మంగళవారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయిస్తుండవచ్చన్న అనుమానంతో సీఐ కరుణాకర్, ఎస్సైలు శ్రీకాంత్, శివరామకృష్ణ ఆధ్వర్యంలోని మూడు బృందాలు ఏక కాలంలో కిరాణా, పాన్ షాపులను సోదా చేశాయి.

సారపాక, ఫిబ్రవరి 6: సారపాకలోని పాన్ షాపులు, ఇతర షాపులను ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు చేపట్టారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడుతుండడంతో తనిఖీ చేశామన్నారు.

పినపాక, ఫిబ్రవరి 6: యువతను లక్ష్యంగా చేసుకొని కిరాణా దుకాణాల్లో గంజాయి చాక్లెట్ల అమ్మకం ఆందోళన కలిగిస్తుందని సీఐ శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన పినపాకలోని తనిఖీలు నిర్వహించారు. గంజాయి చాక్లెట్లు దుకాణాల్లో విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జూలూరుపాడు, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని పాన్, కిరాణా దుకాణాల్లో సీఐ శ్రీనివాస్, ఎస్సై జీవన్‌రాజు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మత్తు చాక్లెట్లు, మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గృహజ్యోతి లబ్ధిదారుల వివరాలు సేకరించండి

వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చుంచుపల్లి, ఫిబ్రవరి 6 : విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం కోసం విద్యుత్ సర్వీస్ నంబర్‌కు రేషన్‌కార్డును అనుసంధానం చేయించాలని మండల విద్యుత్‌శాఖ ఏఈ నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పొందేందుకు విద్యుత్ వినియోగదారులు మీటర్ బిల్లు కొట్టే వారికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు వారికి చూపించి విద్యుత్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేయించుకోవాలన్నారు.

పాల్వంచ, ఫిబ్రవరి 6: గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందేందుకు మంగళవారం పాల్వంచ పట్టణంలోని గొల్లగూడెం ఏరియాలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్ మీటర్ రీడింగ్‌బిల్లు నమోదు సమయంలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎస్ఈ శ్రీరమేష్, డివిజన్ ఇంజినీర్ నందయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మణ్, అకౌంట్స్ ఆఫీసర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట, ఫిబ్రవరి 6: గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపికకు వివరాలు సేకరించాలని ఏఈలు, బిల్ కలెక్టర్లను డిస్కం ఏడీఈ వెంకటేశ్వర్లు ఆదేశించారు. విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు చేసేటప్పుడే.. 200 యూనిట్లు లోపు ఉన్న వినియోగదారుల ఆధార్, రేషన్ కార్డులను మీటర్ నంబర్‌కు అనుసంధానించాలని అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఆయన గృహ జ్యోతి పథకం మార్గదర్శకాలను వివరించారు. 2023లో విద్యుత్ వినియోగం ఆధారంగానే అర్హులను ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 6: పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెంకటమ్మకు రేగా నివాళి

అశ్వాపురం, ఫిబ్రవరి 6: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మాజీ ఎంపీపీ ఇసంపల్లి నర్సింహారావు మాతృమూర్తి వెంకటమ్మ మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మృతురాలి నివాసానికెళ్లి వెంకటమ్మ భౌతికకాయానికి సందర్శించి నివాళి అర్పించారు.

అథ్లెటిక్స్ టీషర్ట్స్ ఆవిష్కరణ

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 6 : రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌సిప్ పోటీలు ఈ నెల 10వ తేదీన జిల్లాలోని రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా మైదానంలో జరగనున్నాయి. ఇందులో భాగంగా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టీషర్ట్స్‌ను ఏరియా జీఎం శాలెంరాజు మంగళవారం ఆవిష్కరించారు. సింగరేణి సంస్థ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. 33 జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది అథ్లెట్లు పాల్గొంటారని పేర్కొన్నారు.

దగ్గువస్తే క్షయ పరీక్ష చేయించుకోవాలి

జూలూరుపాడు, ఫిబ్రవరి 6 : వారంరోజులకు పైగా దగ్గు, రాత్రి వేళల్లో చెమటలు, జ్వరం రావడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తే క్షయ వ్యాధి నిర్ధారణ కోసం తేమడ పరీక్ష చేయించుకోవాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లెందు, ఫిబ్రవరి 6: మేడారం ప్రాంగణంలో ఈ నెల 13న జరిగే ఆదివాసీ తెగల సంస్కృతి రాష్ట్ర స్థాయి సమ్మేళనం కరపత్రాన్ని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని కుమ్రం భీం విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను హింసిస్తే కఠిన చర్యలు

కరకగూడెం, ఫిబ్రవరి 6: అడవుల్లో సంచరిస్తున్న వన్యప్రాణులను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడూళ్లబయ్యారం రేంజర్ తేజస్విని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని అంగారుగూడెం, నీలాద్రిపేట, రేగళ్ల, నిమ్మగూడెం అశ్వాపురంపాడు వలస ఆదివాసీ గ్రామాల్లో అటవీ శాఖ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గొత్తికోయల నుంచి 20 బాణాలు, కేజీ ఉచ్చులు స్వాధీనం చేసుకున్నారు. జంతువులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వన్యప్రాణులను హాని కలిగిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

తరిగిపోతున్న గుట్టలు.. చోద్యం చూస్తున్న అధికారులు కెనాల్ మట్టినీ వదలని అక్రమార్కులు

మట్టిని తోడేస్తున్నారు..!

క్వారీలుగా మారిన గుట్టలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 6 : మండలంలోని పలు గ్రామాల్లో మట్టి అక్రమ రవాణా దందా మూడుపువ్వులు.. ఆరుకాయలచందంగా జోరుగా సాగుతోంది. గుట్టలు, ప్రభుత్వ భూముల్లో మట్టి తోలకాలు యధేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. జూలూరుపాడు సమీపంలోని మార్కెట్‌యార్డ్‌కు కేటాయించిన స్థలంలోని గుట్టలు, పాపకొల్లు, అన్నారుపాడు, పడమటనర్సాపురం గ్రామ సమీపంలోని ఉన్న గుట్టలు, కాకర్ల గ్రామ సమీపంలో ని పాలగుట్ట వద్ద ప్రభుత్వభూమితోపాటు మండల సమీపం నుంచి వెళ్తున్న సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టిని సైతం అక్రమార్కులు రాత్రివేళల్లో కొత్తగూడెం, పాల్వంచ, ఏన్కూరు, జూలూరుపాడు సుజాతనగర్ మండలాల్లోని వెంచర్లకు తరలించి రూ.లక్షలు దండుకుంటున్నారు. అటవీశాఖ భూముల్లో సైతం యధేచ్ఛగా రాత్రివేళలో మట్టి తోలకాలను సాగిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శారదను వివరణ కోరగా ప్రభుత్వ భూముల్లో మట్టి తోలకాలకి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పడమటనర్సాపురం గ్రామంలో రెండు టిప్పర్లు, జేసీబీని ఇటీవలే సీజ్ చేసి రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు.

మొక్కుబడిగా మండల సమావేశం

మాట్లాడుతున్న ఎంపీపీ సోని

జూలూరుపాడు, ఫిబ్రవరి 6: గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశానికి సగానికిపైగా అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. పంచాయతీ స్పెషలాఫీసర్లకు కలెక్టరేట్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఉండడంతో వారు హాజరుకాలేదు. ఎంపీటీసీలు 10మంది ఉండగా నలుగురు హాజరవ్వగా మరో ఇద్దరు రికార్డులో సంతకం చేసి వెళ్లారు. 15మంది హాజరుకాలేదు. ఎంపీపీ లావుడ్యా సోని మాట్లాడుతూ వచ్చే వేసవికాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బస్సులో దొరికిన బ్యాగ్ అందజేత

భద్రాచలం, ఫిబ్రవరి 6: బస్సులో దొరికిన బ్యాగ్‌ను పోలీసుల ద్వారా దాని స్వంతదారుకు భద్రాచలం వాసి అందించారు, నిజాయితీని నిరూపించుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు... భద్రాచలం వాసి, గ్రీన్ భద్రాద్రి మాజీ అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణార్జునరావు వారం క్రితం హైదరాబాద్ నుంచి బస్సులో భద్రాచలం వస్తుండగా బ్యాగ్ దొరికింది. అందులో ల్యాప్‌టాప్ తదితరాలు ఉన్నాయి. ఆయన భద్రాచలం చేరుకోగానే, దానికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అందులోని చిరునామా ఆధారంగా, దానిని.. ఏపీలోని కర్నూలుకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డిగా గుర్తించారు. పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఆయన భద్రాచలం పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఆ బ్యాగ్ తీసుకున్నారు. తన బ్యాగును భద్రంగా అందించిన కృష్ణార్జునరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఐ నాగరాజ్ రెడ్డి పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ బాలుర జిల్లా జట్టు ఎంపికలు

ఎంపికైన జిల్లా బాలుర జట్టు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 6 : జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ బాలుర ఎంపికలు సెయింట్ జ్జేవియర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫాదర్ బాలస్వామి, సిస్టర్ జోష్ని పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని సూచించారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో వరంగల్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు. కార్యక్రమంలో సాయితేజ, కోచ్ పృధ్వీ, పీఈటీలు వెంకటేష్, లక్ష్మీనారాయణ, జేమ్స్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 6: అంకిత భావంతో పనిచేసి ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలవాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలను పాటించాలని మణుగూరు ఏరియా జీఎం, మల్టీ డిపార్టమెంట్ బృందం కన్వీనర్ దుర్గం రామచందర్ అన్నారు. మంగళవారం సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పీకేఓసీ–2లో మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ ఆధ్వర్యంలో 'మన సంస్థ, మన గని, మన బాధ్యత'పై నిర్వహించిన అవగాహగన కార్యక్రమంలో మాట్లాడారు. మణుగూరు ఏరియా ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడంలో అధికారులు, ఉద్యోగులు సమిష్టి కృషి కారణమన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సంక్షిప్తం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని హమాలీ కాలనీకి చెందిన కారింగుల రాజు(33) ఆటోడ్రైవర్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందారు. గతంలో అతని భార్య ఉష కూడా మృతిచెందడంతో వారి ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు. విషయం తెలుసుకున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ చిన్నారులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పిల్లల చదువుల నిమిత్తం మంగళవారం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో చెలకలపెళ్లి శివ, అశోక్, సంతోష్, రాజు, కరుణశ్రీ, శ్రీను, రవిచంద్ర పాల్గొన్నారు.

కొల్లాపూర్ రైలు పునరుద్ధరణ

భద్రాచలం, ఫిబ్రవరి 6: మణుగూరు–కొల్లాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే అధికారులు సోమవారం పునరుద్ధరించారు. ఇది, మణుగూరు నుంచి కాకుండా భద్రాచలం రోడ్ (కొత్తగూడెం)నుంచి మాత్రమే నడుస్తుంది. ప్రతి రోజూ సాయంత్రం 4.35 గంటలకు కొత్తగూడెంలో బయలుదేరుతుంది. ఈ రైలును పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు మహబాద్ ఎంపీ కవిత లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కొల్లాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను అధికారులు సోమవారం పునరుద్ధరించారు.

చేతి వృత్తిదారులకు రుణాలివ్వాలి

చండ్రుగొండ, ఫిబ్రవరి 6: చేతి వృత్తిదారులకు రుణాలివ్వాలని నాయీబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కడియాల హుస్సేన్ కోరారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళి షాపులు పెట్టుకునేందుకు పేదలకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 6 : విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8:30నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ హేమచంద్రబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బర్మాక్యాంప్, బాబూక్యాంప్, బర్లిపిట్, సన్యాసి బస్తీ, మధురబస్తీ, బస్టాండ్ ఏరియా, రామాటాకీస్ ఏరియా వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ములకలపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని రాచన్నగూడెం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం స్థానికులకు గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. వారు ఇచ్చిన సమాచారంతో అక్కడకు ఎస్సై రాజమౌళి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాల్వంచ, ఫిబ్రవరి 6: పట్టణ పోలీసులు మంగళవారం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాన్ని భద్రపర్చారు. ఆదివారం రాత్రి పాల్వంచ బస్టాండ్‌లో పడిపోయి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, స్థానికులు అతన్ని పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తెలిసిన వాళ్లు పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్సై రాము కోరారు.

రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 6: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో మంగళవారం సీతారామచంద్ర స్వామికి అర్చకులు నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ట్రైనీ ఐపీఎస్‌లు

పర్ణశాల, ఫిబ్రవరి 6: పర్ణశాల రామయ్యను మంగళవారం ట్రైనీ ఐపీఎస్‌లు శివమ్ ఉపాధ్యాయ, శశిధరణి రెడ్డి, అంకిర్త్ దర్శించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పంచవటి, నారచీరెల ప్రాంతాన్ని సందర్శించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు.

సిద్ధమవుతున్న గోటి తలంబ్రాలు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 6: సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవానికి స్థానిక ఆత్మారాముని ఆలయంలో భక్తులు గోటి తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ధర్మ జాగరణ సంస్థ జిల్లా బాధ్యుడు ఎంవీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సులానగర్ పీహెచ్‌సీ తనిఖీ

టేకులపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని సులానగర్ పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ జేవీఎల్ శిరీష మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుకృత, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దినేష్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధు వరుణ్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గన్నానాయక్ పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 6: సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. జేకే ఉపరితల గని, ఏరియా హాస్పిటల్‌లో మంగళవారం ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, ప్రణాళికలు, లక్ష్యాల సాధన తదితరాంశాలపై కార్మికులతో మాట్లాడారు. ఎస్ఓటు జీఎం మల్లయ్య, అధికారులు శివప్రసాద్, గిరిధరరావు, నరసింహరాజు, వెంకటేశ్వర్లు, జీవీ మోహన్‌రావు, మధుబాబు, డాక్టర్ మల్లారెడ్డి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై దాడి

గుండాల, ఫిబ్రవరి 6: అంగనన్‌వాడీ టీచర్‌పై వ్యక్తి దాడి చేసిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంధిలోని సజ్జలబోడు లో అంగన్‌వాడీ టీచర్‌పై అదే గ్రామానికి చెందిన వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆమె కేకలు వేయడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా అతను అక్కడి నుంచి పారిపోయాడు. ఆమెను గుండాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించారు. ఈ విషయమై గుండాల ఎస్సై కిన్నెర రాజశేఖర్‌ను వివరణ అడగగా దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

టేకులపల్లి, ఫిబ్రవరి 6: కొత్తగూడెంలోని వైద్య కళాశాల విద్యార్థులు.. మండలంలోని సులానగర్ పీహెచ్‌సీని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోకాళ్ళ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. శిక్షణలో భాగంగా వారు ఇక్కడకు వచ్చారు. ఏయే సీజన్లలో ఎలాంటి సమస్యలతో రోగులు వస్తారు..? వారికి పారామెడికల్ సిబ్బంది ఎలాంటి వైద్యం చేస్తారు..? తదితర వివరాలను తెలుసుకున్నారు. ఫార్మసీ ల్యాబ్‌ను, లేబర్ వార్డును పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దినేష్, డాక్టర్ రోహిత్ పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు తేదీలు ఖరారు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్, మే నెలలో జరగనున్న నేపథ్యంలో పరీక్ష ఫీజు చెల్లించేందుకు తేదీలు ఖరారు చేసినట్లు డీఈవో వెంకటేశ్వరచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్స్ కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.150 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు, రూ.25 అపరాధ రుసుముతో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 28నుంచి మార్చి 4 వరకు చెల్లించవచ్చని తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

టేకులపల్లి, ఫిబ్రవరి 6: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో కేపీఎల్ (కనకయ్య ప్రీమియర్ లీగ్) సీజన్–1 మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులకు టీషర్ట్స్ అందించారు. నాయకులు కోరం సురేందర్, ఉండేటి ప్రసాద్, అజ్మీరా శివ, ఇస్లావత్ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చోరీ నిందితుల అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 6: అంతర్రాష్ట్ర చోరీ నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్సై షాహీనా తెలిపిన వివరాలు.. మండలంలోని ఎర్రగుంటలోగల కిరాణా షాపు వద్ద పార్క్ చేసిన బైక్‌ను అర్ధరాత్రి వేళ కారులో వచ్చిన వ్యక్తులు అపహరించేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో అటువైపు వచ్చిన పోలీసులు గమనించి, వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆ ఆగంతకులు కారును వదిలేసి పరారయ్యారు. మండలంలోని మైబూబ్ నగర్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు.. ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిని ఏపీలోని పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన మన్నేపల్లి పవన్‌కుమార్, సయ్యద్ షరీఫ్‌గా గుర్తించారు. వారిద్దరిని అరెస్ట్ చేశారు. ఎర్రగుంటలో బైక్ చోరీకి యత్నించింది తామేనని ఒప్పుకున్నారు. తాము చేసిన ఇతరత్రా నేరాల చిట్టా విప్పారు. ఈ ఇద్దరిలో ఒకరు బీటెక్ విద్యార్థి, మరొకరు సెక్యూరిటీ గార్డ్. మరో ముగ్గురితో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ముగ్గురూ పరారీలో ఉన్నారు. గతంలో ఈ ముఠాపై వివిధ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కోర్టు ఆదేశంతో వీరిద్దరినీ జైలుకు తరలించారు.

ఈజీఎస్ సోషల్ ఆడిట్

దమ్మపేట, ఫిబ్రవరి 6: మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) సామాజిక తనిఖీలు (సోషల్ ఆడిట్) మంగళవారం జరిగాయి. హరితహారం మొక్కల్లో 90 శాతం బాగున్నాయని సోషల్ ఆడిట్ బృందం ప్రజావేదికలో వెల్లడించింది. ఎంపీపీ ప్రసాద్, జడ్పీటీసీ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు, ఏపీడీ రవి, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఏపీవో సుధాకర్ పాల్గొన్నారు.

టీఎన్‌జీవో నూతన కార్యవర్గం

పాల్వంచ, ఫిబ్రవరి 6 : టీఎన్‌జీవో తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమాన్ని స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, కార్యదర్శి సాయి భార్గవ చైతన్యల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా నరసింహారావు, కోశాధికారిగా రాంబాబు, ఉపాధ్యక్షుడిగా పవన్, సతీశ్, కల్యాణి, దమయంతి, విజయ, బాబు, రమాదేవి, వీరబాబు, రామనర్సయ్య, సోమయ్య, సతీష్‌బాబును ఎన్నుకున్నారు.